ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఖమ్మం fb.com/vaartha

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-11-2024 మంగళవారం సంపుటి: 30 సంచిక: 298 పేజీలు: 8+16 వెల: 6.50

మహారాష్ట్ర పిసిసి చీఫ్ నానా పాటోల్ రాజీనామా 5
అజిత్ మద్దతుతో 'మహా' సిఎంగా ఫడ్నవిస్? 7

# అదానీ విరాళం వద్దన్నాం..

## రూ.100 కోట్లు స్కిల్ వర్సిటీకి బదలీ చేయొద్దని అదానీకి లేఖ

**ఆ గ్రూపుపై విమర్శల దృష్ట్యా తిరస్కరిస్తున్నాం..**

ఢిల్లీ వెళ్లేది కేబినెట్ విస్తరణకు కాదు..

రాష్ట్రానికి రావాల్సిన నిధులు సాధించడానికి..

దానికోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళ్తా..

**అదానీతో కెసిఆర్ ఫొటో ఇదిగో.. విచారణకు సిద్ధమా?**

మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్



సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు25:** అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సర్కారు అత్యంత ప్రతిష్మాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని ఈ మేరకు నిర్ణయించింది. ఈ విషయాన్ని వెల్లడించేందుకు సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియా సమా వేశం ఏర్పాటు చేశారు. ఆ గ్రూప్‌పై విమర్శల నేపథ్యంలో అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసు కోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు ఓ లేఖను పంపి నట్లుగా సీఎంవెల్లడించారు. అదానీవిషయంలో గతకొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా చర్చలుజరుగుతున్నాయని చెప్పారు. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులను స్వీకరించిందని కొందరు విమర్శిస్తున్నారని తప్పుపట్టారు. >>2

# తడిసి మోపెడవుతున్న త్రిబులార్ ఖర్చు

**ఉత్తరదిశ నిర్మాణ వ్యయం రూ. 8100 కోట్లు**

**భూనిర్వాసితులకు పరిహారంగా రూ.5400 కోట్లు**



**హైదరాబాద్,నవంబరు 25, ప్రభాతవార్త:** జాతీయ రహ దారుల ప్రాధి కారం సంస్థ రీజినల్ రింగ్ రోడ్డు అంచనాలు అనిశ్చితిని పెంచు తున్నాయి. తెలంగాణకు గేమ్‌చేంజర్‌గా భావిస్తు న్న ఈ రోడ్డు ఉత్తర దక్షిణవైపు కలుపుకొని 320కి.మి నిడివితో నిర్మించనున్నారు. ఉత్తరభాగం 162 కి.మి నిర్మాణంకు 8100కోట్లు వ్యయం అవుతుందని ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు తాజాగా లెక్క కట్టారు. సంగారెడ్డి తూప్రాన్, గజ్వేల్ జగదేవ్‌పూర్, యాదాద్రి, భువనగిరి, చౌటుప్పల్ పట్టణాలను అనుసందానిస్తూ ఈ రోడ్డు నిర్మాణం కానున్నది. మొదటి నాలుగువరసలకు ఒక్కో కిలోమీటరుకు రూ. 50కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు ఐదు మీటర్ల ఎత్తులో ఉండేలా డిజైన్ చేయడంతో నిర్మాణ వ్యయం అధికమైంది. 2021లో ఈ ప్రతిపాదన వచ్చినపుడు నాలుగు వరసల 158.46 కిమి ఈ రోడ్డు నిర్మాణంకు 7512కోట్లు వ్యయం అవుతుందని అంచనావేశారు. తాజాగా ఉత్తర భాగం రోడ్డు >>2



# రాష్ట్ర ఖజానా విలవిల

**ద్రవ్యలోటు రూ.35 వేల కోట్లు**


## పెరిగిన అప్పులు, రుణాలపై వడ్డీ భారం

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** ఆదాయ, వ్యయాల మధ్య అంతరం పెరిగి పోతుడటంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానా లోటుతోవిలవిల్లాడుతోంది. పన్నేతర ఆదాయం తగ్గడంతో పాటు, తెచ్చిన అప్పులకు కిస్తీల చెల్లింపు భారం పెరగడంతో ద్రవ్య లోటు, రెవెన్యూ లోటు భారీగా పెరిగింది. ఆర్థిక శాఖ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలోని తొలి ఏడు >>2

# ఇజ్రాయెల్‌పై హెజ్బుల్లా భీకర దాడులు

250కి పైగా రాకెట్ల ప్రయోగం

జనావాసాలు విధ్వంసం



**బీరూట్, నవంబరు 25:** లెబనాన్ సరిహద్దులనుంచి ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా రాకెట్ దాడులుచేయడంతో కొన్నింటిని ఇజ్రాయెల్‌కూల్చివేసినా మరికొన్ని జనావాసాలపై పడి ధ్వంసం అయ్యాయి. సుమారు 250కిపైగా రాకెట్లను ఇతర క్షిపణులను ఇజ్రాయెల్‌పైకి హెజ్‌బొల్లా పంపించినట్లు తేలింది. మిలిటెంట్ గ్రూప్ ఇటీవలికాలంలో జరిపిన దాడులకంటే భిన్నంగా ఈ దాడులుచేయడంతోకనీసం ఏడుగురికి తీవ్ర గాయాలయినట్లు ఇజ్రాయెల్‌ప్రకటించింది. అయితే ఇజ్రాయెల్ వాయుసేన కొన్నింటిని ఛేదించి కూల్చి వేసింది. మరికొన్ని మాత్రం మధ్య ఇజ్రాయెల్‌లోని ఇళ్లను ధ్వంసంచేసినట్లు వార్తలు వచ్చాయి. కొన్ని క్షిపణులయితే రాజధాని టెల్ అవీవ్‌కు కూడా చేరినట్లు హెజ్‌బొల్లాప్రకటించింది. డ్రోన్ల సాయంతో చేసిన దాడులు అష్డోద్ నావల్‌బేస్‌ను ధ్వంసంచేసామని హెజ్‌బొల్లా వెల్లడించింది. ఆతర్వాత అధునాతన క్షిపణులను డ్రోన్లను ఏకకాలంలో మిలిటరీ లక్ష్యంగా దాడులుచేసామని గ్లిలాట్ ఆర్మీ నిఘా వేస్‌పైనా దాడులుచేసినట్లు ప్రకటించుకుంది. అంతకుముందు కూడా ఈఇంటెలిజెన్స్ బేస్‌పై దాడులుచేసినట్లు హెజ్‌బొల్లా తెలిపింది. ఇజ్రాయెల్ మిలిటరీకూడా 250వరకూ క్షిపణులు వచ్చాయని, యుద్ధంలో అత్యధిక సంఖ్యలో రావడం ఇదే ప్రథమం అనివెల్లడించింది. గతసెప్టెంబరు 24వ తేదీ ఇజ్రాయెల్ హెజ్‌బొల్లాపై దాడులుప్రారంభించిన తర్వాత లెబనాన్‌నుంచి 350కిపైగా రాకెట్‌లు, క్షిపణులు దాడులుచేసినట్లు అంగీకరించింది. అంతకుముందురోజు ఇజ్రాయెల్ హెజ్‌బొల్లా గుండెకాయలాంటినరపాంతంపై దాడిచేయడంతో 84 మంది చనిపోయారు. గత వారంరోజులుగా ప్రమాదకరమైన దాడులతో బీరూట్‌ను ఇజ్రాయెల్ అతలాకుతలంచేసింది ఆదివారం బీరూట్ ప్రాంతాన్ని పూర్తిగా రాకపోకలు >>2



# అదానీపై రగడ రగడ

## వెంటనే దర్యాప్తు జరపాలని విపక్షాల డిమాండ్

**నిరసనల మధ్య పార్లమెంటు ఉభయసభలు రేపటికి వాయిదా**

**న్యూఢిల్లీ, నవంబరు 25:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభంనుంచే విపక్షాలు సమష్టిగావిమర్శలతో దాడిచేయడంతో ఉభయసభలను బుధవారం వరకూ వాయిదావేసారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని రాజ్యసభ ప్రతిపక్షం గౌతమ్ ఆదాని వ్యవహారం లేవనెత్తేందుకు ప్రయత్నించింది. సౌర ఇంధన సరఫరా కాంట్రాక్టులు పొందేందుకు లంచాలు ఇచ్చినట్లు అమెరికా కోర్టులో అభియోగాలు నమోదు చేయడంపైచర్చించాలని పట్టుబట్టాయి. అదేవిధంగా లోక్‌సభ కూడా ఎలాంటి కార్యకలాపాలు జరక్కుండానే వాయిదాపడింది. ప్రతిపక్ష సభ్యులు విభిన్న అంశాలపై చర్చకు లేవనెత్తడంతో స్పీకర్ ఓంబిర్లా చివరినిమిషంలో వాయిదావేసారు. వాయిదాపడిన తర్వాత మధ్యాహ్నం నుంచి తిరిగి ప్రారంభం అయిన లోక్‌సభలో సభ్యులు నినాదాలుచేస్తూ నిరసన ప్రకటించారు. సంభాల్ మసీదు సర్వేపరంగా అలర్లపై వారు ధ్వజమెత్తారు. వెంటనే దర్యాప్తుచేయించాలని అలాగే అమెరికా కోర్టులో ప్రముఖ వ్యాపారవేత్తపై నమోదయిన అభియోగాలపైనా దర్యాప్తుచేయాలని పట్టుబట్టారు. బిజెపి సభ్యుడు సంధ్యారాయ్ స్పీకర్ స్థానంలో ఉన్నారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించనిపక్షంలో వాయిదా తప్పదని హెచ్చరించారు. అయినా కూడా సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో బుధవారం వరకూ వాయిదావేస్తున్నట్లుప్రకించారు. అంతకుముందు దిగువసభనున ఒక పర్యాయం మధ్యాహ్నం వరకూ వాయిదావేసారు. దివంగతులయిన సభ్యులకు నివాళి అర్పించారు. వారిలో ఇద్దరు ఎంపిలు కూడా ఉన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మరో ఆరుగురుఎంపిలు ఆదాని లంచాల వ్యవహారంపై దర్యాప్తుచేయాలని పట్టుబట్టారు. ఆదాని వ్యవహారం మొత్తం దేశంపై ప్రభావంచూపిస్తోందని అన్నారు. దేశప్రతిష్ఠ అంతర్జాతీయంగా దిగజారిపోయిందని, ప్రధాని నరేంద్రమోడీ ఇప్పటికీ ఆదానికే మద్దతిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. ఈ దశలో చైర్మన్ జగ్‌దీప్ ధంకర్ ఖర్గే వ్యాఖ్యలను రికార్డుల్లోంచి తొలగించాలని ఆదేశించారు. అయితే విపక్ష సభ్యులు ఎంతకు తగ్గకపోవడంతో సభను 15 నిమిషాలు వాయిదావేసారు. సభ మళ్లీ 11.45 గంటలకు పునరుద్ధరించినా విపక్ష సభునయల నిరసన మళ్లీ మొదలయింది. సభ అజెండా ప్రకారం నడిచేందుకు సభ్యులు సహకరించాలని జగదీప్‌ధంకర్ పదేపదే విజ్ఞప్తిచేసారు. అయితే ఫలితం కనిపించకపోవడంతో చైర్మన్ సభను మరుసటిరోజుకు వాయిదావేసారు. మంగళవారం పార్లమెంటులో ప్రత్యేక కార్యక్రమం జరగనున్నది. పార్లమెంటుసెంట్రల్ హాలులో 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రత్యేకకార్యక్రమం నిర్వహించనున్నారు. అందువల్ల మంగళవారం పార్లమెంటు సమావేశాలను రద్దుచేసారు. 1949లో >>2

25 సార్లు ఢిల్లీ వెళ్లి రేవంత్
# తెచ్చిందేమిటి?

**రైతు పంట బోనస్ బోగస్సైంది.. గిరిజనులే తగిన బుద్ధి చెబుతారు**

**లగచర్లకు వెళితే సిఎంను ఉరికించి కొడుతారు: కెటిఆర్**



మహబూబాబాద్ మహాధర్నాలో ప్రసంగిస్తున్న కెటిఆర్. చిత్రంలోఎర్రబెల్లి, కవిత తదితరలు

**మహబూబాబాద్,నవంబర్25,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సిఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళితే ఉరికించి ఉరికించి కొడుతారని రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ జిల్లాపార్టీ అధ్యక్షురాలు మాలోతు కవిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహాధర్నాలో రాష్ట్ర నలు మూలల నుండి బిఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గత 14సంవత్సరాల క్రితం నాటి తెలంగాణ ఉద్యమంలో మానుకోట పెద్ద >>2



# ఆహార కల్తీకి చెక్

**హోటళ్ల సంఖ్య ఆధారంగా తనిఖీ అధికారుల నియామకం**

**ఒకే గొడుగు కిందికి ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్**

**నాచారం ఫుడ్ సేఫ్టీ ల్యాబ్ ఆధునీకరణ, కొత్తగా మరో మూడు ఏర్పాటు**

**ఫిర్యాదుల స్వీకరణ పరిష్కారానికి కలెక్టరేట్లలో ప్రత్యేక విభాగం**

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణలోని హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీఆహారం నాణ్యతపైప్రభుత్వం దృష్టిసారించింది. ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతపై నిరంతరం నిఘాఉంచి కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలకు సిద్ధమైంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు అవసరమైన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్రంలో హోటళ్ల సంఖ్యఆధారంగా ఆహార తనిఖీ అధికారులను నియమించాలని నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. >>2

అనుమానాస్పద స్థితిలో 'లా' విద్యార్థిని మృతి 3

'పట్నం' పిటిషన్‌పై ముగిసిన విచారణ తీర్పువాయిదా 3

భీకరంగా మారిన ఉక్రెయిన్ యుద్ధం 5

'పాన్' ఆధునీకరణ ప్రాజెక్టుకు
# రూ.1435 కోట్లు

## అరుణాచల్‌లో రెండు హైడ్రోవిద్యుత్‌కేంద్రాలు

**రైల్వేల్లో మూడు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు రూ.7927 కోట్లు**

**వన్‌నేషన్ -వన్ సబ్‌స్క్రిప్షన్ పథకానికి రూ.6000 కోట్లు**

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీలోని పార్లమెంటు ఆవరణలో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ. చిత్రంలో కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, డాక్టర్ జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్

**న్యూఢిల్లీ,నవంబరు 25:** పార్లమెంటు శీతాకాల సమావేశాల సమయంలో ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్‌కమిటీ కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఆర్థికలావాదేవీల్లో అత్యంత కీలకంగా మారిన పాన్‌కార్డును మరింత ఆధునీకరించనుంది. పాన్2.0 ప్రాజెక్టుకు 1435 కోట్లు కేటాయించింది. టెక్నాలజీ ఆధారిత సేవలు పన్ను చెల్లింపుదారుల రిజిస్ట్రేషన్ సేవలు వారికున్న ప్రయోజనాలు కూడా మరింత మెరుగవుతాయని కేబినెట్ చెపుతోంది. మరింత సులువుగా పాన్ నంబరును ధృవీకరించుకోవచ్చు. మరింత భద్రతాపూర్వకమైన ఫీచర్లను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని డిజిటల్ వ్యవస్థలకు ప్రభుత్వ ఏజెన్సీలకు పాన్‌ఇకపై సార్వజనీన గుర్తింపు సంఖ్యగా తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నదని సమాచార మంత్రి అశ్వినివైష్ణవ్ వెల్లడించారు. అదేవిధంగా కేబినెట్ సమావేశంలో 240 మెగావాట్ల హీయో హైడ్రో విద్యుత్‌ప్రాజెక్టును నిర్మించేందుకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం 1939 కోట్లు వ్యయం అవుతుంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని షియోమి జిల్లాలో ఏర్పాటుచేసే ఈప్రాజెక్టు 50 నెలల్లో పూర్తిచేయాలన్న లక్ష్యం విధించింది. అదేవిధంగా అరుణాచల్ ప్రదేశ్‌లోనే టాటో-1హైడ్రో విద్యుత్‌ప్రాజెక్టు మరోటి ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం 1750 కోట్లు వ్యయం అవుతుంది. ఈ ప్రాజెక్టు కూడా 50 నెలల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది. రవాణా వ్యవస్థను మరింత ఆధునీకరించే దిశగా >>2

# భద్రాద్రిని ధనిక జిల్లా చేస్తాం

## కొత్తగూడెం పర్యటనలో మంత్రి తుమ్మల

**కొత్తగూడెం, నవంబర్ 25 - ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అభివృద్ధి పరంగా ఆదర్శంగా నిలపడమే కాకుండా ధనిక జిల్లాగా తీర్చిదిద్దడమే మా అందరి లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కొత్తగూడెంలో పర్యటనలో భాగంగా మొదట నందతండా నుంచి వికలాంగుల కాలనీ వరకు నిర్మాణం చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకటరావులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రూ.1.50 కోట్లతో కొత్తగూడెంలో నిర్మాణం చేసిన గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడారు.

# వ్యాపారికి రూ.8.14 కోట్లు టోకరా : నేరగాడి అరెస్టు

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** నగరంలోని వ్యాపారికి స్టాక్ ఎక్స్ఛేంజిలో పెట్టుబడులపేరిట నిండా ముంచి ఎనిమిది కోట్ల 14 లక్షల 48 వేల రూపాయలను కాజేసిన సైబర్ నేరగాళ్ల ముఠాలో ఒక నేరగాడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అరెస్టు చేసింది. బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారిని ఇటీవల కొందరు సైబర్‌నేరగాళ్లు తెలివిగా స్టాక్‌మార్కెట్లో తాము సూచించిన కంపెనీల్లో పెట్టుబడులుపెడితే దండిగా లాభాలు వస్తాయని నమ్మించారు. మొదట్లో కొంతమేర లాభాలు వచ్చినా ఆ తరువాత మరింత పెట్టుబడులు పెట్టమని సదరు వ్యాపారిని నమ్మించి అతనిచేత ఎనిమిది కోట్ల 14 లక్షల 48 వేల రూపాయలను పెట్టుబడులు పెట్టించారు. వాస్తవానికి ఈ నగదును సైబర్ నేరగాళ్లు తెలివిగా కాజేశారు. ఇదే సమయంలో వ్యాపారి ఫోన్‌లో లాభాలు ఉన్నట్లు డిస్‌ప్లే వచ్చినా అతను దానిని బ్యాంకు నుంచి డ్రా చేసుకోలేకపోయాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రంగంలో దిగి విచారించగా వ్యాపారి బదలీచేసిన డబ్బులు పలు ఖాతాలకు వెళ్లినట్లు గుర్తించారు. ఇందులో రాజస్థాన్‌లోని చిత్తోర్‌గడ్‌కు చెందిన శ్రవణ్‌కుమార్‌శర్మ ఖాతాకు 27 లక్షల రూపాయలు బదలీ అయినట్లు తేలింది. శ్రవణ్ కుమార్‌ను అరెస్టుచేసి విచారించగా తాను సైబర్‌నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను కమీషన్ ప్రాతిపదికన సమకూర్చినట్లు అంగీకరించాడు. ఇతని ఖాతాలో ఉన్న నగదును జప్తు చేశారు. నిందితుడిని హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.



కడా కార్యాలయం ఆవరణలో జాతీయ హక్కుల కమిషన్ సభ్యులు

## లగచర్ల దాడి ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆరా

### కడా అధికారితో మాట్లాడిన కమిషన్ సభ్యులు

**కొడంగల్, నవంబరు 25, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని లగచర్ల,ఆర్‌పితండాల్లో జరిగిన దాడి ఘటన పరణామాలపై ఆరా తీసేందుకు జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యులు ముఖేష్,రోహిత్‌సింగ్,ప్రకాష్‌శర్మ తదితరుల అధికారుల బృంధం సోమవారం కొడంగల్‌లోని కడా కార్యాలయానికి వచ్చారు.ఈ సందర్భంగా కడా ప్రత్యేక అధికారి వెంకట రెడ్డిపై ఈనెల 11న జరిగిన దాడి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.దాడి ఘటనపై విచారం వ్యక్తం చేస్తు ఆరోగ్య పరిస్దితిని అడిగి తెలుసుకున్నారు.అలాగే లగచర్ల దాడి అనంతరం గ్రామంలోని నిందితులను అదుపులోకి తీసుకునే రోజు అర్ధరాత్రి సమయం నుంచి మరుసటి రోజు వేకువజాము వరకు విద్యుత్ సరఫరా లేకపోవడానికి గల కారణాలను సంభందిత విద్యుత్ అధికారులను అడిగి తెలుసున్నారు.ఈ విషయంపై విద్యుత్ శాఖ డీఈ భానుప్రసాద్,ఏడీ అర్జున్‌కుమార్,ఏఈ ఇతర సిబ్బందితో వివరంగా ఓ పేపర్‌పై వివరణ తీసుకున్నారు.గిరిజనులను అరెస్టు చేసిన సమయంలో విద్యుత్ సమస్యలు తలెత్తడంతోనే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని విచారణకు వచ్చిన జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యులకు తెలిపారు.అరెస్టు చేసిన రోజు రా త్రి 1 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు సమస్య ఉందని,అనంతరం విద్యుత్ సమస్యను గుర్తించి పరిష్కరించినట్లు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చినట్లు సమాచారం.లగచర్ల ఘటనపై పత్రికల్లో ఇష్టానుసారంగా వార్తలు వస్తుండడంపై జాతీయ మానవ హక్కుల కమీషన్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, కొడంగల్, బొంరాస్‌పేట్ ఎస్సైలు సత్యనారాయణ, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నరేందర్‌రెడ్డి పిటిషన్‌పై ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 25:** లగచర్ల దాడి ఘటనలో అరెస్టై జైల్లో ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. లగచర్ల దాడి ఘటనలో పోలీసులు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే ఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయడాన్ని పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు.

ఒకే సంఘటనపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయవద్దన్న సుప్రీంకోర్టు తీర్పులను పట్నం నరేందర్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరోవైపు, ఈ కేసులకు సంబంధించిన వివరాలను ఏఏజీ కోర్టుకు వివరించారు. పోలీసులు వేర్వేరు కేసులు ఎందుకు నమోదు చేశారో తెలిపారు. ఈరోజు వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని లగచర్లలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులపూ గ్రామస్థులు దాడి చేశారు. ఈ కేసులో మాజీ ఎంఎల్ఏ పట్నం నరేందర్ రెడ్డిని ఏ1గా, బిఆర్ఎస్ కార్యకర్త భోగమోని సురేశ్ ను ఏ2గా నిందితులుగా చేర్చారు. ఈ కేసులో అరెస్టయిన పట్నం నరేందర్ రెడ్డి జ్యుడీషియల్ రిమాండ్ లో భాగంగా ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్నారు.

# తెలంగాణలో అంబర్ - రెసోజెట్ పెట్టుబడులు

## రూ.250 కోట్లతో ఉత్పాదక ప్లాంట్లు ఏర్పాటు చేయనున్న సంస్థ

### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణలో అంబర్ - రెసోజెట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. రూ. 250 కోట్లు రూపాయలు పెట్టుబడులతో ఉత్పాదక ప్లాంటును సంస్థ ఏర్పాటు చేస్తుందని, వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సోమవారం ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో సంస్థ ప్రతినిధులు తమ పెట్టుబడుల ప్రణాళికను వెల్లడించారు. పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వినిమయ వస్తువులు, విడిభాగాలు అందించే అంబర్ - రెసోజెట్ భాగస్వామ్య సంస్థ రాష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. అంబర్ - రెసోజెట్ సంస్థకు ప్రభుత్వపరంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సంస్థ దేశంలోని పలు కంపెనీల కోసం రూమ్ ఏసీలు, అత్యాధునిక వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, పారిశ్రామిక ఎయిర్ కండిషనర్ల లాంటి పలు పరికరాలకు ఉత్పత్తి చేసి అందిస్తోందని మంత్రి తెలిపారు. వచ్చే మూడేళ్లలో రూ.250 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పుతుందని శ్రీధర్ బాబు చెప్పారు. దీని వల్ల ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే అత్యాధునిక ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పిసిబి)ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. వందేభారత్ రైళ్లు, మెట్రో రైళ్ల ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలతో పాటు, బస్సులు, డిఫెన్స్ వాహనాలు, పారిశ్రామిక అవసరాలకు ఎయిర్ కండిషనర్ల తయారీలో అంబర్ ఎంటర్ ప్రైజెస్‌కు మంచి పేరుందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి యూనిట్లు ఉన్న అంబర్ తాజాగా హైదరాబాద్‌ను గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టిజిఐఐసి ఎండి డా. ఇ.విష్ణువర్ధన్ రెడ్డి, సిఇఒ మధుసూదన్, డైరెక్టర్ ఎలక్ట్రానిక్స్ డా. ఎస్ కె శర్మ, అంబర్, రెసోజెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదస్థితిలో లా విద్యార్థిని మృతి

### మలక్‌పేట పోలీస్‌స్టేషన్ వద్ద గిరిజన సంఘాల ఆందోళన

### జాతీయ రహదారిపై బైఠాయించి గిరిజన సంఘాల నాయకుల రాస్తారోకో

**మలక్‌పేట, నవంబరు 25, ప్రభాతవార్త:** అనుమానాస్పదస్థితిలో ఓ న్యాయ విద్యార్థిని మృతి చెందిన సంఘటన మలక్‌పేట ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. రంగారెడ్డి జిల్లా కర్తాల్ మండలం టక్‌రాజ్ గుడాకు చెందిన ఇస్లావత్ రమేష్, కంసీ దంపతులకు శ్రావ్య(20), సాయికిరణ్, శృతి ముగ్గురు సంతానం. శ్రావ్య(20) ఎల్బీనగర్‌లోని ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ ఎల్.ఎల్.బి నాలుగో సంవత్సరం చదువుతోంది, శృతి ఇంటర్, సాయికిరణ్ మేడ్చల్లో బీటెక్ చదువుతున్నాడు. శ్రావ్య చదువుకుంటూ పని చేస్తోంది. ఈ క్రమంలో సలీంనగర్‌లోని నంది రెసిడెన్సీలో నవీన్ అనే వ్యక్తి జయదుర్గా కన్సల్టెన్సీ పేరుతో ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థను నిర్వహిస్తున్నాడు. గత మూడు నెలలుగా ఆమె అక్కడ పనిచేస్తుంది. ఆదివారం ఉదయం కన్సల్టెన్సీ వద్దకు వెళ్లి తన తమ్ముడికి శ్రావ్య ఫోన్ చేసి 20,000 పంపించమని చెప్పగా తమ్ముడు వెంటనే నగదు పంపించాడు. అనంతరం కొంతసేపు తర్వాత తమ్ముడు సాయికిరణ్ శ్రావ్యకు ఫోన్ చేయడంతో ఆమె ఫోన్ ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చి ఆమె రూమ్మేట్‌కు శిరీషకి ఫోన్ చేస్తే శిరీష సోనికి తెలియజేయడంతో సోనీ కార్తీక్ అనే వ్యక్తితో కలిసి మలక్‌పేట్ సలీం నగర్ కన్సల్టెన్సీ వద్దకు వచ్చి కిటికీలోంచి చూడగా శ్రావ్య చున్నితో ఉరి వేసుకొని ఉన్న దృశ్యం కనిపించడంతో తలుపులు పగలగొట్టి శ్రావ్యను మలక్‌పేట్ యశోద ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఆసుపత్రి వైద్యులు శ్రావ్యను పరిశీలించి ఆమె చనిపోయినట్లు పేర్కొన్నారు. ఇన్‌సెక్టర్ పిడమర్తి నరేష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మూసారంబాగ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహిస్తున్న గిరిజన సంఘాల నాయకులు తదితరులు, ఇన్‌సెట్‌లో విద్యార్థిని ఇస్లావత్ శ్రావ్య (ఫైల్)

**ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి శిక్షిస్తాం: ఎసిపి శ్యాంసుందర్**

అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన శ్రావ్య సంఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి శిక్షించడం జరుగుతుందని మలక్‌పేట్ ఎసిపి శ్యాంసుందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రావ్య మృతి చెందిన సంఘటన తెలియడంతో మలక్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నరేష్ వెంటనే సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించడం జరిగిందని, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించడం జరిగిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని అన్నారు. కన్సల్టెన్సీ నిర్వాహకుడు నవీన్‌తో పాటు కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు.

**అత్యాచారంచేసి హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు : గిరిజన సంఘాలు**

శ్రావ్యను అత్యాచారం చేసి హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపించారు. శ్రావ్య ఉదాంతం తెలియడంతో సోమవారం ఉదయం పలువురు గిరిజన సంఘాల నాయకులు మలక్పేట పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేసి సంఘటనకు బాధ్యులైన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ముసారం బాగ్ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేసి ఆందోళన చేయడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి పోయింది. అనంతరం పోలీసులు వారికి నచ్చ చెప్పారు. ఈ సంఘటనపై లోతుగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# సైబర్‌క్రైం బాధితులకు రూ.70.23 లక్షల అందజేత

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** నగరంలోని నాలుగు ఘటనల్లో సైబర్ క్రైం నేరగా ళ్ల బారినపడ్డ నలుగురు బాధితులకు సైబర్ క్రైం పోలీసులు భారీ ఊరట లభించేలా చేశారు. నాలుగు కేసుల్లో బాధితులకు 70 లక్షల 23 వేల 152 రూపాయలను అందజేశారు. ఇందు లో మొదటి కేసులో 59 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగి స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరిట నేరగాళ్ల బారినపడి 37 లక్షల 70వేల రూపాయలు పోగొట్టుకోగా దీనిపై ఫిర్యాదు అందిన వెంటనే రంగంలో దిగిన సైబర్ క్రైం పోలీసులు నేరగాళ్ల ఖాతాలపై ఆరా తీయగా కొందరి వివరాలు సేకరించి అందులో బాధితుడి నుంచి కాజేసిన సొమ్ములో 32 లక్షల 84 వేల 527 రూపాయ లుండగా వాటిని జప్తు చేసి, దీనిని బాధితుడికి సోమవారం నాడు అందజేశారు. మరో ఘటనలో 45 ఏళ్ల వ్యాపారి నెట్ బ్యాంకింగ్ మోసం ద్వారా సైబర్ నేరగాళ్ల బారినపడి 21 లక్షల 78 వేల 627 రూపాయలు పోగొట్టుకున్నాడు. దీనిపై ఫిర్యాదు అందిన వెంటనే రంగంలో దిగిన సైబర్ క్రైం పోలీసులు నేరగాళ్ల ఖాతాలపై ఆరా తీయగా వారి వివరాలు సేకరించి అందులో బాధితుడి నుంచి కాజేసిన మొత్తం సొమ్ము వుండగా దానిని జప్తు చేసి, బాధితుడికి సోమవారం నాడు అందజేశారు. ఇంకో ఘటనలో ఎస్‌బిఐ క్రెడిట్ కార్డ్ సర్వీస్ పేరిట సైబర్ నేరగాళ్ల బారినపడి 11 లక్షల 71 వేల 800 రూపాయలు పోగొట్టుకోగా దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే రంగంలో దిగిన సైబర్ క్రైం పోలీసులు నేరగాళ్ల ఖాతాలపై ఆరా తీయగా కొందరి వివరాలు సేకరించి అందులో బాధితుడి నుంచి కాజేసిన సొమ్ములో మూడు లక్షల 59 వేల 998 రూపాయ లుండగా వాటిని జప్తు చేసి, దీనిని బాధితుడికి సోమవారం నాడు అందజేశారు. మరో ఘటనలో 51 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగి సైబర్ నేరగాళ్ల బారినపడి 16 లక్షల రూపాయు పోగొట్టుకున్నాడు. దీనిపై ఫిర్యాదు అందిన వెంటనే రంగంలో దిగిన పోలీసులు నేరగాళ్ల ఖాతాల్లో వున్న 12 లక్షల రూపాయలను జప్తు చేసి బాధితుడికి అందజేశారు.

# అదానీతో చేసుకున్న రూ.12,400 కోట్ల ఒప్పందాల సంగతేమిటి?

### సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 25:** యంగ్ ఇండియా స్కిల్స్ యూ ని వర్సిటీకి ఇటీవల అదానీ ప్రకటించిన 100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన రూ.100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పెడుతామనే ప్రతిపాదనతో వస్తే, మర్యాదపూర్వకంగా కలిసి చాయ్ తాగించి పంపించేశామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని తెలిపారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు అన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# అధికారులపై తిరగబడడం సరైన చర్యకాదు

### లగచర్లను సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



ఫార్మా బాధిత గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**దుద్యాల్, నవంబరు 25, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా దుద్యాల మం డలం లగచర్లను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమ వారం సందర్శించారు. కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లెల శంకర్, నీలాదేవిలతో కలిసి లగచర్ల, రోటిబండ తాండాలో జరిగిన సంఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రజల నుండి తగు సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆయన ముచ్చటించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని, సమ స్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, అధికారులపై తిరగబడడం సరైన విధానం కాదని అన్నారు. సంఘటన జరిగిన పరి ణామాల అనంతరం జరుగుతున్న విషయాలను పలు గ్రామాల ప్రజ లను అడిగి తెలుసుకున్నారు. సంఘటనలో లేనివారిని కూడా పోలీసులు అరెస్టు చేస్తున్నారని ప్రజలు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకువెళ్తానని, ఎవరు అధైర్య పడకూడదని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ప్రజల హక్కుల కోసం పనిచేస్తుందని, మీ బాధలు, సమస్యలను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని ఆయన తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారమే ప్రభుత్వం భూసేకరణ చేపడుతుందని, బల వంతంగా భూసేకరణకు పూనుకోదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా లగచర్ల, రోటిబడ్డ తాండ, పోలేపల్లి, హకీంపేట్‌లలో భూ సేకరణ వివరాలను రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలు సుకు న్నారు. చైర్మన్‌తోపాటు ఎస్సీ వెల్ఫేర్ అధికారి మల్లేశం, సంబం ధిత అధికారులు ఉన్నారు. అనంతరం వికా రాబాద్ జిల్లా అనంతగిరి హరిత రిసార్ట్ కు చేరుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

# కామారెడ్డి బిసి డిక్లరేషన్‌ను అమలుచేయాలి

### డెడికేటెడ్ కమిషన్ స్వతంత్రంగా పనిచేయాలి

### కమిషన్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి



**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్లపై స్పష్టత కోసం ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ స్వతంత్రంగా పనిచేయాలని అన్నారు. తెలంగాణ జాగృతి పక్షాన డెడికేటెడ్ కమిషన్‌కి కవిత సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. బీసీల రిజర్వేషన్‌కి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ యధాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక బీసీ సంఘాలు, మేధావులు ఇచ్చిన సూచనలు అమలుకు నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం 11 మాసాలు కాలయాపన చేసిందని విమర్శించారు. ఈ డెడికేటెడ్ కమిషన్ స్వతంత్రంగా పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రత్యేక కార్యాలయం, మానవ వనరులు, సామగ్రి ఇవ్వకుంటే ఆ కమిటీ ఎలా పనిచేస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కుల గణనపై నెల రోజుల్లో నివేదిక అంటే ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కమిషన్ పూర్తి స్వతంత్రంగా పనిచేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని సూచించారు. కులగణనకు చట్టబద్ధత కల్పించాలని, రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కుల గణన కోసం ఇళ్లకు వెళుతున్న సర్వే సిబ్బంది కుటుంబాలను ఫ్రిడ్జ్ ఉందా, కూలర్ ఉందా? అని అడగాడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. హైదరాబాద్‌లో ఇప్పటికి 70 శాతం ఇళ్లకు స్టిక్కర్లు వేయలేదన్నారు. 90 శాతం సర్వే పూర్తయినట్టు చెబుతున్న ప్రభుత్వం ఆ డేటా కంప్యూటరీకరణ చేసిందా? అని కవిత ప్రశ్నించారు.

# ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం

### హుస్నాబాద్‌కు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తా

### గౌరవెల్లి డిస్ట్రిబ్యూషన్ కాలువలకు రైతులు సహకరించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 25, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తీరుతామని రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.సోమవారం రోజున సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా పాలన,ప్రజా విజయోత్సవాల సభ నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10నెలల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు.హుస్నాబాద్ ప్రాంత ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిసిన నేను మంత్రిని అయ్యానని గుర్తు చేశారు.ఈ ప్రాంత శాసనసభ్యులుగా తనను గెలిపించిన ఈ హుస్నాబాద్ నియోజకవర్గానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకోస్తానని హామీ ఇచ్చారు.ఆ దిశలోనే హుస్నాబాద్ ప్రభుత్వ పాఠశాలలకు కలెక్టర్ సహకారంతో కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గౌరవెల్లి ప్రాజెక్టు విషయానికి వస్తే ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం 433కోట్లు కేటాయించిందని, ఈ ప్రాజెక్టులోని నీటిని రైతులకు అందించేందుకు డిస్ట్రిబ్యూషన్ కెనాల్ (కాల్వలకు) మూడు జిల్లాల కలెక్టర్‌లతో భూ సేకరణ జరుగుతోందని దీనికి రైతులందరూ సహకరించాలన్నారు.

ఈ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కారిడార్ తెచ్చి ఉద్యోగావకాశాలు కల్పిసామన్నారు. ఈ ప్రాంతం లో ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకే సెట్విన్ కేంద్రాన్ని ప్రారంభించా మన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాం మూర్తి, తహసీల్దార్ రవిందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్యతోపాటు పార్టీనాయకులు, కార్య కర్తలు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


**శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము**

చెరువుగట్టు గ్రామం, నార్కట్‌పల్లి మండలం, నల్లగొండ జిల్లా, తెలంగాణ-508254

ఇ-మెయిల్: aceochervugattu@yahoo.in ఫోన్: 9100023701, 702, 703

Rc.No.06/SPJRSD/2024, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన** తేది: 25.11.2024

శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం, చెరువుగట్టు గ్రామం, నార్కట్‌పల్లి మండలం, నల్లగొండ జిల్లాకు 12 నెలల కాలానికి ఆహారపదార్థాల సరఫరా నిమిత్తం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్‌లు కోరబడుతున్నవి. వివరాలకు ఈ క్రింది వెబ్‌సైట్: https://tender.telangana.gov.in వీక్షించండి (లేదా) 9703662667, 9885645656 సంప్రదించండి.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్.

DIPR.NO. 7032-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 25.11.2024

# దేశవ్యాప్త జనగణనలో కులగణన చేపట్టాలి

## పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిసిబిల్లు పెట్టాలి: బిసిల సమరభేరిలో అఖిలపక్ష నేతలు




సోమవారం జరిగిన బిసి సమరభేరి మహాసభలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, కోదండరామ్, వి.హనుమంతరావు, గుజ్జకృష్ణ, వకుళాభరణం, జి.అంజి, నందగోపాల్, నీలవెంకటేష్ తదితర నాయకులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), నవంబరు 25 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణనలో కులగణన చేపట్టాలని అఖిలపక్ష సమరభేరి మహాసభలో పాల్గొన్న నేతలు డిమాండ్ చేశారు. అలాగే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బిసి బిల్లుపెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రి త్వశాఖ ఏర్పాటు, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మధ్యాహ్నం రవీంద్రభారతిలో జరిగిన అఖిలపక్ష సమరభేరి మహాసభలో పాల్గొన్న నేతలు పేర్కొన్నారు. నీల వెంకటేష్, నందగోపాల్ అధ్యక్షతన గుజ్జకృష్ణ, ఉదయ్‌నేత సమన్వయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ కోదండరామ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బి.హనుమంతరావు, మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర బిసి కమిషన్ మాజీ అధ్యక్షుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితర ప్రముఖ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్నికులాలకు, సామాజికవరా ్గలకు వారి జనాభా ప్రకారం రాజకీయరంగంలో ప్రాతినిధ్యం, వివిధ రంగాల్లో ఉద్యోగ, ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76ఏళ్లు గడిచినా దేశంలో 56శాతం జనాభా ఉన్న బిసిలకు ఇంతవరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించలేదని వాపోయారు. బిసిలకు ఓట్లు వేసే అధికారమున్నా అధికారంలో వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు ప్రజాస్వా మ్యం ధనస్వామ్యంగా మారి డబ్బుల ప్రభావం ఎన్నికలమీదపడి డబ్బుల్లేని బిసిలు ఎన్నికల్లో గెలవలేకపోతున్నారన్నారు. బిసిలకు రావాల్సి న వాటా కోసం అధ్యయనం జరగాలని, బిసిలకు రాజ్యాంగబద్ధ హక్కులు, వాటా కల్పించాల్సి న సమయం ఆసన్నమైందన్నారు.

వి.హనుమంతరావు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమేర్పడి రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కాగానే దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని, ఆయన ప్రోద్బలంతోనే తెలంగాణలో సమగ్ర సర్వే నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

కోదండరామ్ మాట్లాడుతూ దేశవ్యాప్తం కులగణన విషయంలో సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుత సమగ్రసర్వేలో అవసరంలేని ఎన్నో అంశాలుండడంతో ప్రజల్లో ఎన్నో అపోహలకు దారి తీసిందని, తగిన శ్రద్ధవహిస్తే బాగుండేదన్నారు. బిసిలు అన్నిరంగాలతోపాటు రాజకీ యరంగంలో అత్యున్నతస్థాయి ఎదగాలని, రాష్ట్రంలో బిసి రాజ్యంరావాలని వకుళాభరణం కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఈ సమరభేరిలో బిసిల కొరకు 14 తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మహాసభలో పాల్గొన్న 56 బిసి కులసంఘాలు, 36సంఘాలు, 28 ఉద్యోగసంఘాలు, ఉభయ తెలుగు రాష్ట్రాల బిసి నాయకులు పార్టీలకు అతీతంగా బిసిలంతా సంఘటితమంటూ చేతులు కలిపి అభివాదం చేశారు.



సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ సాంస్కృతికి సారధి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెన్నెల

## సాంస్కృతిక సారథి చైర్మన్‌గా వెన్నెల బాధ్యతల స్వీకారం

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త :** తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్‌గా డా.వెన్నెల బాధ్యతలు స్వీకరించారు. సోమవారం మాదాపూర్‌లోని సాంస్కృతిక సారథి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, ప్రొ.కోదండరాం, మాజీ ఎంపి విహెచ్, సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి, విమల గద్దర్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా.మామిడి హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం కల్పించడంతో పాటు సమాజాన్ని జాగృతం చేయడంలో వెన్నెల సారధ్యంలోని సాంస్కృతిక సారధి కృషి చేయాలని ఆకాంక్షించారు. టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజా గాయకుడు గద్దర్ కీలక పాత్ర పోషించారనీ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గద్దర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన ఆట, పాటకు ఆదరణ దక్కలేదనీ, కళాకారులకు సరైన గుర్తింపు దక్కలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో కళాకారులందరికీ సముచిత గౌరవం లభిస్తున్నదని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ తెలిపారు.

# అజిత్ మద్దతుతో సీఎంగా ఫడ్నవిస్

### వెనక్కితగ్గిన షిండే వర్గం?

### కేబినెట్‌లో కీలకబెర్త్‌ల కోసం పోరు



**ముంబయి, నవంబరు 25:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిపై ఉత్కంఠకు తెరపడుతోంది. సీఎం రేసులో దేవేంద్ర ఫడ్నవిస్ ముందున్నట్లు బిజెపి నేతలే చెపుతున్నారు.ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ఫడ్నవిస్ అటు బిజెపి అధ్యక్షుడు నడ్డా, ఇటు హోంమంత్రి అమిత్‌షాలనుకలిసి చర్చించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి మంగళవారం అత్యవసరంగా ప్రమాణ స్వీకారంచేయాల్సి ఉంది. ఈలోపు సీఎంగా ఏక్‌నాథ్‌షిండే తన రాజీనామా లేఖను గవర్నర్‌ను కలిసి ఇస్తారు. అలాగే ప్రభుత్వాన్ని కూడా రద్దుచేస్తున్నట్లు అదేరోజు అందచేస్తారు. కొత్తప్రభుత్వం ఏర్పాటయ్యేంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలనే గవర్నర్ సూచనమేరకు కొత్తప్రభుత్వం ఏర్పాటయ్యేంతవరకూ కొనసాగుతారు. ఇక సీఎం పదవిపరంగా ముందు షిండే బీహార్ తరహా ఫార్ములాను కూడా సూచించారని సమాచారం. బిజెపి ప్రభుత్వం మళ్లీ ప్రాభవం సాధించేందుకు తనవంతుగా ఎంతోకృషి చేసి శివసేనను చీల్చిచెండాడిన వీరునిగా బిజెపిలో పేరున్న షిండేకే సీఎం పదవి ఇవ్వాలని సేన వర్గీయులు పట్టుబడుతున్నారు. అయితే బిజెపి హైకమాండ్ ఆలోచనలు ఎలా ఉన్నాయో ఆయ నకు అంతుబట్టక పోవడంతో బహుశా కేంద్ర మంత్రిపదవికే మొగ్గు చూపిస్తారని చెపుతున్నారు. మరోపక్క ఫడ్నవిస్‌నే కేంద్ర మంత్రిగా నియమించి మా నేతకు సీఎం పదవి ఇవ్వాలని షిండే వర్గీ యులు పట్టుబడుతున్నారు. ఇదిలా ఉంటే అజిత్ పవార్ మాత్రం తనకు ఫడ్నవిస్ అయితేనే మంచి దని షిండేతో తనకు పొసగదని వాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో మంగళ ౯వారం మొత్తం మహారాష్ట్ర రాజకీయమే మారి పోనుంది. ప్రస్తుతం ఫడ్నవిస్‌తోపాటు, ఏక్‌నాథ్ షిండే, అజిత్‌పవార్‌లు కూడా ఢిల్లీలోనే ఉన్నారు. వారితో ఈరోజు రాత్రికి అమిత్‌షా చర్చించి నిర్ణయం ప్రకటిస్తారన్నది అంచనా. వాస్తవానికి లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కుమార్తె వివాహ రిసెప్షన్‌కు వెళుతున్నట్లుగా ఉన్న వీరంతా కచ్చి తంగా హోంమంత్రిని కలుసుకుంటారని వినికిడి. ఇక మంత్రి పదవులపరంగా కూడా కేబినెట్‌లో బిజెపి నుంచి 21మంది, శివసేన షిండేనుంచి 12 మంది, ఎన్సీపీ అజిత్‌పవార్ వైపునుంచి పది మందికి మంత్రులగా ఛాన్స్ రావచ్చని తెలుస్తోంది. సీఎంమినహా 43 మందికి మంత్రివర్గంలో ఛాన్స్ ఉందని మూడు పార్టీల నేతలు వీటిపై ఎంతో ఆసక్తితో ఉన్నారు.



## ఘనంగా ముగిసిన కోటి దీపోత్సవాలు

### భక్తులతో కిక్కిరిసిన ఎన్టీఆర్ స్టేడియం

**హైదరాబాద్ (ముషీరాబాద్), నవంబరు 25, ప్రభాతవార్త:** ఈనెల 9న లోయర్ ట్యాంక్‌బండ్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో అంగరంగ వైభవంగా ప్రారంభమైన కోటిదీపోత్సవ వేడుకలు సోమవారంరాత్రి ఘనంగా ముగిశాయి. పదిహేడు రోజుల పాటు వేలాది మంది భక్తులతో, హరి నామస్మరణతో మారు మ్రోగే ఎన్టీఆర్ స్టేడియం ఆఖరి రోజు కావటంతో భక్తులు భారీగా తరలి వచ్చారు. చివరి రోజు, కార్తీక సోమవారం కలిసి రావటంతో భక్తులతో శివపరివారానికి కోటి రుద్రాక్షలతో అర్చన, యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవం, కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు.

ఈ సందర్భంగా తమిళనాడు ధర్మపురి ఆధీనం పీఠాధిపతి మాసి ల్లమణి దేశిగ జ్ఞానసంబంధ మహాస్వామి అనుగ్రహభాషణం, డా.దివి నరసింహ దీక్షితుల ప్రవచామృతం భక్తులను ఆలరించింది. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథులుగా తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. కోటి దీపాల వెలుగులు, సప్తహారతులు, మహాదేవుని నీరాజనాలతో కోటి దీపోత్సవాలు ముగిశాయి.

# కారు ఢీకొని చిన్నారి మృతి

**హైదరాబాద్ (సరూర్‌నగర్), నవంబరు 25 ప్రభాతవార్త :** ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని కారు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కర్మన్‌ఘాట్ భూపేష్ గుప్తానగర్‌కు చెందిన తిరుపతయ్య కుమార్తె తిరుమల బాలమ్మ(2)సోమవారం ఇంటి ముందు ఆడుకుంటుంది.అదే క్రమంలో మారుతి షిఫ్ట్ కారు వేగంగా వచ్చి పాపను ఢీకొట్టింది.దీంతో ఆమె తలపై కారు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. నిర్లక్ష్యంగా,వేగంగా కారు నడిపిన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఇవి కీలక సమావేశాలు

### సజావుగా నడుపుతూ 2025లోకి వెళ్దాం

### నేడు ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవం: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, నవంబరు 25:** ప్రజలచేత తిరస్కరించబడిన కొందరు వ్యక్తులు కొందరిచేత గూండాయిజం చేయించి పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రధాని మోడీ విపక్షాలపై ధ్వజమెత్తారు. వారిచర్యలు దేశప్రజలందరూ చూస్తున్నారని, సమయం వచ్చినపుడు వారు చూస్తూ ఉండరని, గుణపాఠం గట్టిగా చెపుతారన్నారు. పార్టీలతో సంబంధంలేకుండా కొత్తగా పార్లమెంట్‌కు ఎన్నికైనవారు కొత్త ఆలోచనలతో వస్తారని, కొందరి గందరగోళ చర్యల వల్ల కొత్త ఎంపిలకు సభలో మాట్లాడే అవకాశం రావడంలేదని ఆయన ఆందోళన వ్యక్తంచేసారు. వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించడం వారికి తెలియదని, ప్రజల ఆకాంక్షలు వారికి పట్టవని వారికి ప్రజలపై ఎలాంటి బాధ్యత ఉండదని, కేవలం స్వలాభం కోసమే వారు పనిచేస్తారంటూ విపక్షాలపై ధ్వజమెత్తారు. సభ కార్యకలాపాలను సజావుగా సాగనీయరని అదేవారి నైజమని కూడా అన్నారు. ప్రపంచం ఇపుడు మనల్ని ఎంతో ఆశావహదృక్పథంతో చూస్తోందని, ఆ గౌరవం పెంపొందేలా సభలో మన ప్రవర్తన ఉండాలని, పార్లమెంటు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉందని, దానికి అనుగుణంగా మనం నడుచుకోవాలని అన్నారు. అనేక అంశాలను సరైన రీతిలో సభలో ఎత్తి చూపించడంద్వారా మనం వారి ఆకాంక్షలను నెరవేర్చగలమని దాని నుంచి రాబోయే తరాలు ప్రేరణ పొందుతాయని ఈ శీతాకాల సమావేశాలు ఫలవంతంకావాలనే ఆశిస్తున్నట్లు మోడీ చెప్పారు. ఈ సమావేశాలను ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఎంపిలందరికీ విజ్ఞప్తి చేసారు. 2024 సంవత్సరం పూర్తికావస్తోందని, 2025 కోసం దేశం మొత్తం సిద్ధమవుతోందని, ఈపార్లమెంటు సమావేశాలు ఎన్నో కీలక అంశాలపరంగా ముఖ్యమైనవని మోడీ అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈనవంబరు 26 నాటికి 75వ ఏడాదిలోకి ప్రవేశిస్తున్నామని దానికి గుర్తుగా రేపు సంవిధాన్‌సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుందామని మోడీ మీడియాతో మాట్లాడారు. శీతాకాల సమావేశాల ప్రారంభానికిముందు పార్లమెంటు బయట ప్రధాని మీడియాతో మాట్లాడారు.

## మళ్లీ రాజకీయంగా యాక్టివ్ అవుతున్న కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు25:** బిఆర్ఎస్ నాయకురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజకీయంగా మళ్లీ యాక్టివ్ అవుతున్నారు. లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయి జైలు నుంచి విడుదలైన తర్వాత ఇప్పటి వరకు సైలెంట్‌గానే ఉంటూ వచ్చారు. హెల్త్ ఇష్యూస్‌తో ఇంటికే పరిమితమైన కవిత ఇప్పుడు బీసీ నినాదంతో మళ్లీ లైమ్ లైట్‌లోకి వస్తున్నారు. రేవంత్ సర్కార్‌ను ఇబ్బంది పెట్టేందుకు ఓ బ్రహ్మాస్త్రాన్ని సిద్ధం చేస్తున్నారు. అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటుబీసీ హక్కుల సాధన ఎజెండాతో యూనైటెడ్ పూలే ఫ్రంట్, భారత జాగృతితో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధం అయ్యారు. జైలుకు వెళ్లే ముందే పూలే ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే ఎజెండాతో పొలిటికల్‌గా యాక్టివ్ అయ్యేందుకు కవిత ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే బీసీ సంఘాల నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారట. పూలే ఫ్రంట్‌తో పాటు రాష్ట్రంలో బీసీల సంఘాలతో భేటీ అవుతూ సమస్యల పరిష్కారం కోసం వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. మరోవైపు తెలంగాణ జాగృతిని కూడా మళ్లీ యాక్టివ్ చేసే యోచనలో కవిత ఉన్నట్టు సమాచారం. గతంలో తెలంగాణ జాగృతి పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేశారు. కానీ కవిత జైలుకెళ్లాక జాగృతి సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు జాగృతిని మరోసారి యాక్టివ్ చేసేందుకు జాగృతి నేతలతోనూ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.

## గిరిజన గురుకుల విద్యార్థిని శైలజకు కన్నీటి నివాళి అర్పిస్తున్నా: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు25:** సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యానికి బలైపోయిన వాంకిడి గిరిజన గురుకుల విద్యార్థిని శైలజకు కన్నీటి నివాళి అర్పిస్తున్నట్లు బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. మీ ప్రాణాలు బలి తీసుకున్న పాపం ఈ దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతదన్నారు. 25 రోజులుగా నువ్వు వెంటిలేటర్ మీద అనుభవించిన నరకానికి ప్రభుత్వమే జవాబుదారీ అని హరీశ్‌రావు పేర్కొన్నారు. శైలజ తల్లిదండ్రులకు గుండె కోతను మిగిల్చిండు సీఎం రేవంత్ రెడ్డి. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. విషాహారం వల్ల కన్నుమూయటం కలిచి వేస్తున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకులంలో నాణ్యత లేని భోజనం పెట్టడం పాపం కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థులకు సకాలంలో మెరుగైన చికిత్స అందించకపోవడం మరొక పాపం. అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం విద్యార్థిని ప్రాణాల మీదకు తెచ్చింది. నిమ్స్ ఆసుపత్రిలో బిడ్డను పట్టుకొని అక్కడే ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇవ్వడంలోనూ కాంగ్రెస్ సర్కార్ పూర్తి వైఫల్యం చెందింది. చివరకు ఆ అమ్మాయి చావును కూడా దాచి పెట్టాలనే ఉద్దేశంతో, దొంగ చాటున మృతదేహాన్ని తరలిస్తుండడం సిగ్గుచేటు. గిరిజన విద్యార్థినీ కుటుంబానికి బాధ్యత వహించి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



# వికారాబాద్ నియోజకవర్గ సందర్శనకు రండి

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు25:** ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూతురు వివాహానికి హాజరుకావడానికి స్పీకర్ ప్రసాద్ కుమార్ ఢిల్లీకి వెళ్లారు. అక్కడ తెలంగాణ భవన్ లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి శాలువాతో కప్పి పుష్పగుచ్ఛం అందించారు.ఈసందర్భంగా వికారాబాద్ నియోజకవర్గ విశేషాలను గవర్నర్‌కు స్పీకర్ వివరించారు. తెలంగాణ కాశ్మీర్ అనంతగిరి, మూసీ నది జన్మస్థానం, అనంత పద్మనాభ స్వామి దేవాలయం తమ నియోజకవర్గంలో ఉన్నాయని, సందర్శనకు రావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు.స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆహ్వానానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సానుకూలంగా స్పందించారు.

## రాష్ట్ర పోలీసు విభాగంలో కొద్దిమేర తీరనున్న సిబ్బంది కొరత

### మొదటి విడతగా 8047 మంది సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు విధుల్లోకి..

### డిసెంబర్‌లో 4200 మంది స్పెషల్ పోలీసు కానిస్టేబుళ్ల చేరిక

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు విభాగంలో సిబ్బంది కొరత కొంత మేర తగింది. ఉమ్మడి పది జిల్లాల నుంచి 33 జిల్లాలుగా ఏర్పడిన తరువాత అన్ని జిల్లాలకు సిబ్బందిని సర్దుబాటు చేయలేక అధికారులు నానాపాట్లు పడుతుండడం తెలిసిందే. కొన్ని జిల్లాలలో పట్టుమని 400 మంది సిబ్బంది కూడా లేనిపరిస్థితులు వుండడం విదితమే. తాజాగా 8047 మంది సివిల్, సాయుధ బలగం, ప్రత్యేక సాయుధ బలగం, ఐటి, పిటిఓ సిబ్బంది చేరడంతో ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. వచ్చే డిసెంబర్ నెల మూడవ వారంలో స్పెషల్ పోలీసు బెటాలియన్లలో మరో 4200 మంది కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరనుం డడంతో సిబ్బంది కొరత మరింత తీరనుందని చెప్పాలి. అయినప్పటికీ రాష్ట్ర పోలీసు శాఖలో ఇప్పటికీ 12 వేలకు పైగా ఖాళీలు వుండడం గమనార్హం. వీటికి త్వరలో భర్తీలు చేబట్టనున్నారు. ఉమ్మడి ఎపి నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటై పదేళ్లు గడిచినా తెలంగాణ పోలీసు శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగానే వుండడం గమనార్హం. ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణకు కేటాయించబడిన సిబ్బంది 68 వేల పైచిలుకు మాత్రమే వుండడం విశేషం. ఇదే సమయంలో తెలంగాణలో 33 జిల్లాలుండగా ఇందులో తొమ్మిది చోట్ల పోలీసు కమిషనరేట్లు ఏర్పాటయ్యాయి. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో అనేకచోట్ల రెండేళ్ల క్రితం పోలీసు స్టేషన్లు, ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు, క్రైం విభాగాలు, సైబర్ పోలీసు స్టేషన్లు ఏర్పాటయ్యాయి. వీటన్నింటిలో సిబ్బంది కొరత తీవ్రంగా వుంది. తెలంగాణ ఏర్పాటయ్యాక ఎపికి చెంది తెలంగాణలో పనిచేస్తున్న వారు అనేక మంది సొంత రాష్ట్రానికి వెళ్లిపోగా అక్కడ పనిచేస్తున్న వారు మాత్రం తెలంగాణకు రాలేకపోవడంతో సిబ్బంది కొరత మరింతగా పెరిగింది. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు తెలంగాణలో మూడుసార్లు పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేసినా ఈ ప్రక్రియ వేగంగా నిర్వహించకపోవడం, దీని గురించి అభ్యర్థులకు మీడియా ద్వారా క చ్చితమైన సమాచారం ఇవ్వకపోవడంతో వివాదాలు నెలకొని కోర్టుల వరకు వెళ్లాయి. ఈ కారణంగా భర్తీలు ఆలస్యం అవడం, కొందరు కోర్టుల ద్వారా ఉత్తర్వులు పొ ందే వరకు వెళ్లాయి. మొత్తం మీద గడచిన పదేళ్ల కాలంలో మూడుసార్లు జరిగిన భర్తీలో 32 వేల మంది వరకు ఎస్ఐలు కానిస్టేబుళ్ల భర్తీ అయ్యారు. ఇదే సమయం లో ప్రతీ ఏడాది ఐదు వేల మందికి పైగా పోలీసు శాఖలో పదవీ విరమణ చేస్తున్నారు. ఈ లెక్కన గత పదేళ్ల కాలంలో రాష్ట్ర పోలీసు శాఖలో 45 వేల మంది వర కు పదవీ విరమణ చేశారు. రాష్ట్ర పోలీసు శాఖలో అధికార లెక్కల ప్రకారం 90 వేల మంది వరకు సిబ్బంది వున్నారు. వీరితో పాటు 15 వేల మంది హోంగార్డులు వున్నారు. 90 వేల మంది సిబ్బందిలో సెలవుల్లో వున్నవారు, అనారోగ్య కారణాలతో సుదీర్ఘ సెలవులో వున్నవారు, సస్పెండ్ అయిన వారు, డిస్మిస్ అయిన వారు, చెప్పాపెట్టకుండా దుమ్మాకొడుతున్న వారు ఏడు వేల మంది వరకు వుంటారని అంచనా. పోలీసు శాఖలో మారిన పరిస్థితులకు అనుగుణంగా, పెరిగిన జనాభాకు అను గుణంగా సిబ్బందిని పెంచాల్సి న అవసరం వున్నా అలా జరగడం లేదు. ఉదాహరణకు హైదరాబాద్ నగరాన్నే తీసుకుంటే ఇక్కడ వున్న సిబ్బంది 17 వేలలోపే. ఇం దులో ఖాళీలు మూడు వేల వరకు వుంటాయని అంచనా. సైబరాబాద్, రాచకొండ పరిధుల్లోనూ భారీగా ఖాళీలున్నాయి. మారిన పరిస్థితుల ప్రకారం హైదరాబాద్‌లో కనీసం 25 వేల మంది పోలీసులైనా వుండాల్సి వుండగా, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో 12 వేల మంది చొప్పున సిబ్బంది వుండాలని నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌తో సరిపోలిన బెంగళూరు, చెన్నై,అహ్మదాబాద్ నగరాలలో సిబ్బంది ఎక్కువగా వున్నారు. హైదరాబాద్‌తో కాస్త అటు ఇటుగా వున్న ఢిల్లీలో 60వేల మంది వరకు సిబ్బంది వున్నారు. ఈ నగరాలతో పోలిస్తే హైదరాబాద్ నగరంలో పోలీసుల సంఖ్య చాలా తక్కువ. పొరుగునే వున్న సైబరాబాద్, రాచకొండ కమిషన రేట్ల పరిస్థితి మరీ దయనీయంగా వుంది. అయితే గుడ్డిలోమెల్ల అన్నట్లుగా ఇటీవల మొదటి విడత కానిస్టేబుళ్ల పాసింగ్ పరేడ్ పూర్తయ్యింది. ఇందులో 8047 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు.

వీరిలో 2338 మంది మహిళలున్నారు. వీరిలో 4116 సివిల్, 3603 మంది సాయుధ బలగం, 228 ఐటి విభాగానికి చెందిన వారు వున్నారు. మిగతా వారు సిపిఎల్, పిటిఓకు చెందిన వారు. వీరిని ఆయా జిల్లాలకు పంపడం పూర్తయ్యింది. వచ్చే నెల మూడవ వారంలో 4200 మంది స్పెషల్ పో లీసు కానిస్టేబుళ్లు కూడా శి క్షణ పూర్తి చేసుకుని తమకు కేటాయించిన బెటాలియన్లలో చేరతారు. వీరిని ఆయా జిల్లాలలో సివిల్ పోలీసులకు సహాయ కంగా నియమించనున్నారు. వీరి చేరికతతో పోలీసులపై ఇప్పుడున్న పనిభారం కొంతమేర తీరనుంది.ఇదేసమయంలో పోలీసు గస్తీతో పాటు ఇతరత్రా విభాగాలు పటిష్టం కానున్నాయి.

## ఉపాధి సొమ్ము కేంద్రానిది..కాంగ్రెస్ విజయోత్సవాలు చేసుకోవడమా?

### ఉపాధి పనుల ప్రారంభోత్సవంలో 'ప్రధాని మోడీ' ఫొటో పెట్టాల్సిందే

### లేనిపక్షంలో కాంగ్రెస్ తీరును అడుగడుగునా ఎండగడతాం: బండి సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబరు 25:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నవంబర్ 26న అన్ని గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడం ఆశ్చర్యంగా ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు 90 శాతం నిధులిస్తోంది ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఉపాధి పనుల ప్రారంభోత్సవంలో 'ప్రధాని నరేంద్రమోడీ' ఫోటో పెట్టాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గ్రామాల్లోని మొక్కల పెంపకం, రైతు వేదికలు, వైకుంఠధామాలు, రోడ్ల నిర్మాణం వంటివన్నీ కేంద్రం ఇస్తోన్న ఉపాధి హామీ పథకం నిధులతో జరుగుతున్నవేనని పేర్కొన్నారు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవి తమవిగా చెప్పుకుంటూ ఏడాది పాలనా విజయోత్సవాల పేరుతో ఉపాధి పనుల ప్రారంభించాలని ఉత్తర్వులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సొమ్ము కేంద్రానిదైతే... సోకు రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్నట్లుగా కాంగ్రెస్ తీరు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిందేమీ లేక కేంద్రం నిధులతో అమలవుతున్న ఉపాధి పనులను విజయోత్సవాలుగా ప్రారంభించుకోవడం సిగ్గు చేటన్నారు. నరేంద్ర మోదీ పాలనలో ఉపాధి కూలీలకు సమున్నత లబ్ది చేకూరుతోంది. యూపీఏ హయాంలో గ్రామీణ పేదలకు ఉపాధి దూరమైతే.. ఎన్‌డీఏ పాలనలో కోట్లాది మందికి వరంగా మారిందన్నారు. గత పదేళ్లలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఒక్క తెలంగాణలోనే దాదాపు రూ.30 వేల కోట్ల మేరకు కేటాయించి గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్న ప్రభుత్వం నరేంద్రమోదీదేనన్నారు. ఇంత గొప్ప పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకునేలా గొప్పగా ప్రకటనలు చేసుకోవడం సరికాదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఉపాధి హామీ పథకం పనుల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో ప్రదర్శించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా రాష్ట్రంలో అమలవుతున్న పథకాలన్నింటికీ ప్రధానమంత్రి ఫొటో తప్పనిసరిగా ఉండేలా సర్క్యులర్ జారీ చేయాలి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం తన నిజాయితీని నిరూపించుకోవాలని చెప్పారు.. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజాక్షేత్రంలో అడుగడుగునా ఎండగడతామని హెచ్చరించారు.

